క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో హోమం



వనపర్తి రూరల్: బొడ్రాళ్ల ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని పెద్దగూడెంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం అర్చకులు నూతన బొడ్రాళ్లకు, దీపస్తంభాలు, లింగమయ్య విగ్రహం, శ్రీరాముడి ముఖద్వార స్తంభం, తొడుగులకు పూజలు జరిపించారు. అనంతరం స్థలశుద్ధి, స్వస్తి వాచనం, మహాగణపతి పూజలు నిర్వహించారు. మూల మంత్ర హోమ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొని హోమం చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

విద్యుదాఘాతంలో గేదె మృతి

పాన్‌గల్: విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ముంత వెంకటయ్యకు చెందిన గేదె ఆదివారం మేతకు వెళ్లి ఇంటికి రాకపోవడంతో గ్రామ శివారులో వెతకగా.. పంట పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో విద్యుత్ తీగకు తగిలి మృతిచెందినట్లు రైతు పేర్కొన్నారు. దీని విలువ దాదాపుగా రూ.40 వేల వరకు ఉంటుందని రైతు పేర్కొన్నారు. ప్రభుత్వ పరంగా సాయం చేసి ఆదుకోవాలని రైతు కోరాడు.

3 నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు



అమరచింత: మండలంలోని మిట్టనందిమళ్లలో ఈ నెల 3 నుంచి 5 వరకు శ్రీశ్రీపాటిమీది ఆంజనేయస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. 3న జలాధివాసం, ప్రధాన దేవత హోమం, మహామంగళ హారతి, 4న ధాన్యాధివాసం ప్రతిష్ఠాహోమం, 5న యంత్ర ప్రతిష్ఠ, ధ్వజస్తంభం, బొడ్రాయి ప్రతిష్ఠాపన, కలశ విగ్రహ ప్రతిష్ఠాపనలు కొనసాగుతున్నట్లు వెల్లడించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించే పూజల్లో భక్తులు, గ్రామస్తులు పాల్గొనాలని కోరారు.

పారిశుద్ధ్య పనులు



పాన్‌గల్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ఆదివారం పారిశుద్ధ్య నివారణ చర్యలు చేపట్టారు. ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తా చెదారం తొలగిస్తూ ఆవరణను పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేశారు. దీంతో పాటు జెండా ఆవిష్కరణకు అవసరమగు రంగు కాగితాల తోరణాలను సిద్ధం చేశారు.

అసంపూర్తి డ్రెయినేజీతో ఇబ్బందులు



పాన్‌గల్: మండలంలోని బండపల్లి గ్రామం జమ్మాపూర్ వెళ్లే దారి సమీపంలో అసంపూర్తిగా మిగిలిపోయిన డ్రెయినేజీ కారణంగా మురుగు నీరు నిలిచి ఈగలు, దోమలు వృద్ధి చెందడంతో పాటు రోడ్డు బురదమయంగా మారింది. అసంపూర్తిగా ఉన్న డ్రెయినేజీతో సమీప గృహాల ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రెయినేజీ నిర్మాణం పూర్తి చేసి మురుగు నీరు సాఫీగా వెళ్లేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

అమరచింత: ఆత్మకూర్ నుంచి మస్తీపురం గ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తున్న మస్తీపురం గ్రామానికి చెందిన యువకుడు మహేందర్‌ను ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. రక్తపు గాయాలతో రోడ్డుపై పడి ఉన్న మహేందర్‌ను ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. విషయాన్ని మహేందర్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా.. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వనమహోత్సవానికి సిద్ధం

- ఈ ఏడాది లక్ష్యం 1.22 లక్షల మొక్కలు
- 27 గ్రామ నర్సరీల్లో అందుబాటులో 98 శాతం మొక్కలు



సల్కెలాపురం నర్సరీలో..



కమాలోద్దీన్‌పూర్‌లో మొక్కలు పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

ఖిల్లాఘనపురం: ప్రతి గ్రామంలో వేల సంఖ్యలో మొక్కలు పెంచి వాతావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించగా.. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వనమహోత్సవం పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. ఈ సంవత్సరం చేపట్టే వనమహోత్సవం రెండో విడత కార్యక్రమం కోసం మండల, గ్రామ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ముమ్మరంగా ఏర్పాట్లు మొదలు పెట్టారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాజు, ఏపీఎం లక్ష్మి ప్రతి గ్రామంలో పర్యటించి నర్సరీల్లో మొక్కలు పెంచేందుకు పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు, కూలీలకు సూచనలు చేస్తున్నారు.

ప్రతి గ్రామంలో నర్సరీ

ప్రభుత్వం గతంలో కొన్ని గ్రామాలను ఎంపిక చేసుకొని లక్ష మొక్కల చొప్పున పెంచేవారు. కొత్త రెవెన్యూ చట్టంలో హరితహారం పథకాన్ని చేర్చడంతో ప్రతి గ్రామ పంచాయతీలో తప్పనిసరిగా గ్రామ నర్సరీని ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 29 (కొత్తగా ఏర్పాటు చేసిన రెండు గ్రామ పంచాయతీలతో కలిపి) గ్రామ పంచాయతీలు ఉండగా.. అన్ని గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉంచారు. కొత్తగా ఏర్పడిన రెండు గ్రామ పంచాయతీల్లో మాత్రం ఏర్పాటు చేయలేదు. ప్రతి గ్రామ పంచాయతీలో ఖచ్చితంగా పండ్ల, పూల మొక్కలు ఉండేలా చూస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

1.22 లక్షల మొక్కల పెంపకం

మండలంలో మొత్తం 27 (పాత జీపీ) గ్రామ పంచాయతీల పరిధిలో 1.22 లక్షల మొక్కలు పెంచినట్లు అధికారులు తెలిపారు. ఖిల్లాఘనపురం మండలంలో ఇప్పటికే అన్ని గ్రామాల్లో కలిపి 98 శాతం మొక్కలు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు.

మొక్కలు సిద్ధం



వర్షాలు కురిసిన వెంటనే నా టేందుకు మండలంలోని అన్ని గ్రామాల నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. అన్ని గ్రామాల్లో మొక్కలు నాటేందుకు గుంతలు తవ్విస్తున్నాం. ఈ సంవత్సరం ముందుగానే వర్షాలు కురుస్తుండటంతో పనుల్లో వేగం పెంచాం. – రాజు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలి

కొత్తకోట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతు సమస్యలను పరిష్కరించేందుకు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ భారతి ద్వారా ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొత్తకోట తహసీల్దార్ ఎం.వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని 24గ్రామాల్లో ఈ నెల 3 నుంచి 19వరకు భూ భారతి సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. మండలంలో భూ భారతి సదస్సులను ఏర్పాటు చేసేందుకు రెండు టీంలను ఏర్పాటు చేశామని, అందులో ఒక టీంకు తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మరో టీంకు డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్ బాధ్యులుగా వ్యవహరించనున్నారు. కొత్త పాస్‌పుస్తకం రానివారు, వివరాలు తప్పుగా నమోదయిన, సర్వే నంబర్లు, విస్తరణ, భూమి వివరాలు, సక్రమించిన విధానం, పట్టాదారు పేరు, తండ్రి పేరు మొదలైనవి, సాగులో ఉన్న భూమి కన్నా పాసు పుస్తకంలో తక్కువ నమోదయిన వారు, భూములు నిషేధిత జాబితాలో ఉన్నవారు, సాదా బైనామా క్రమబద్ధీకరణ కానీ వారు, ఓఆర్‌సీ రానీ, ఇనాం భూముల రైతులు, 38–ఈ (టెనెన్సీ) ధ్రువీకరణ పత్రం రానీవారు, లావుని భూమి సమస్యలు ఉన్నవారు, సర్వే సబ్‌డివిజన్ సమస్యలు ఉన్నవారు, భూసేకరణ (ఎల్‌ఏ) సమస్యలు ఉన్నవారితో పాటు ఇతర రెవెన్యూ సమస్యలు ఉన్న రైతులందరూ ఈ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాష్ట్రవతరణ దినోత్సవానికి ఏర్పాట్లు

రాష్ట్ర అవరతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుందామని కొత్తకోట తహసీల్దార్ ఎం.వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని ప్రముఖులు, వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివచ్చి రాష్ట్రవతరణ దినోత్సవంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.



వెంకటేశ్వర్లు, తహసీల్దార్

పాన్‌గల్ మండలంలో..

పాన్‌గల్: మండలంలో ఈ నెల 3వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3వ తేదీన బండపల్లి, దొండాయిపల్లి, 4వ తేదీన దావాజిపల్లి, వెంగళాయిపల్లి, 5వ తేదీన జమ్మాపూర్, మాందాపూర్, 6న అన్నారం, రాయినిపల్లి, 9న గోప్లాపూర్, బుసిరెడ్డిపల్లి, 10న మంగళ్లపల్లి, చింతకుంట, 11న మాధరావుపల్లి, మల్లాయిపల్లి, 12న తెల్లరాళ్లపల్లి, కిష్టాపూర్, 13న చిక్కేపల్లి, శాగాపూర్, 16న కదిరెపాడు, రేమద్దుల, 17న రేమద్దుల, కేతేపల్లి, 18న కేతేపల్లి, పాన్‌గల్, 19న పాన్‌గల్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఉంటాయని తెలిపారు. ఆయా తేదీల్లో రైతులు అందుబాటులో ఉంటూ తమ భూముల సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

రామేశ్వరంలో అమరచింత చిన్నారుల నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న ఐశ్వర్య



నృత్య ప్రదర్శనలో చిన్నారి శ్రీవైష్ణవి

అమరచింత: తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరంలో నిర్వహిస్తున్న నృత్య ప్రదర్శనలో అమరచింత మండలానికి చెందిన ఇద్దరు చిన్నారులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. పాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఐశ్వర్య అంగవైకల్యం ఉన్న కూచిపూడి నృత్యంలో సత్తా చాటింది. జైపూర్ పాదంతో నృత్య ప్రదర్శన ఇవ్వడంతో పలువురి ప్రశంసలు అందుకుంది. అదే విధంగా అమరచింత గ్రామానికి చెందిన నవీన్ కుమార్తె శ్రీవైష్ణవి సైతం కూచిపూడి నృత్యంలో రాణించి సత్తా చాటింది. ఈమేరకు ఐశ్వర్య తల్లి భారతి మాట్లాడుతూ తన కుమార్తె ఐదేళ్ల వయస్సు ఉన్నప్పుడు జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు విరిగిపోయిందని, అప్పటి నుంచి రబ్బర్ కాలు అమర్చామన్నారు. ప్రస్తుతం అమరచింతలోని బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి పూర్తి చేసిందన్నారు. నటరాజ ఆర్ట్స్ అకాడమీ తిరుపతి వారు రామేశ్వరంలో నిర్వహించిన నృత్య పోటీల్లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

టీచర్ల సర్దుబాటు ఉత్తర్వులు సవరించాలి

వనపర్తి విద్యావిభాగం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా జూన్ 6 నుంచి 19 వరకు చేపట్టనున్న బడిబాట కార్యక్రమం ముగిసిన తర్వాత విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల అమరేందర్‌రెడ్డి, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 10 మంది విద్యార్థులకు ఒకరు, 10 నుంచి 30 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లు, 30 నుంచి 50 విద్యార్థులకు ముగ్గురు టీచర్లు, 50 నుంచి 70 మంది విద్యార్థులకు నలుగురు, 70 నుంచి 90 విద్యార్థులకు ఐదుగురు, 90 నుంచి 110 విద్యార్థులకు ఆరుగురు టీచర్లు ఉండే విధంగా సర్దుబాటు చేయాలన్నారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయి పడ్డ ఐదు డీఏలను రాష్ట్ర అవతరణ సందర్భంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

వైద్య విద్యార్థికి ఆర్థికసాయం

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్ గ్రామానికి చెందిన వైద్య విద్యార్థి రంజిత్‌కుమార్‌కు కేఎంఆర్ మెమోరియల్ ట్రస్టు పక్షాన చైర్మన్ కొత్త కళ్యాణ్ రావు అందజేసిన రూ.25 వేల ఆర్థికసాయం చెక్కును ఆదివారం తెలంగాణ రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సురభి శ్రీనివాసురావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా కష్టపడి చదివి మెడిసిన్‌లో సీటు సాధించడం అభినందనీయమన్నారు. రంజిత్‌కుమార్ మంచిర్యాల మెడికల్ కళాశాలల్లో మెడిసిన్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బాగా చదువుకొని వైద్యుడిగా పేదలకు సేవ చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డీసీఈబీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్, నాయకులు పుల్లారావు, దశరథం, రాజగౌడ్, లక్ష్మీనారాయణ, కృష్ణయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం చెక్కును అందజేస్తున్న శ్రీనివాస్‌రావు

మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రణాళికలు

ఆత్మకూర్: మున్సిపాలిటీ అభివృద్ధికి 100 రోజుల కార్యచరణను రూపొందించి ముందుకెళ్తున్నట్లు కమిషనర్ చికినె శశిధర్ అన్నారు. ఆదివారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో వార్డుల అధికారులు, సిబ్బందితో సమావేశమై యాక్షన్‌ప్లాన్ వెల్లడించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ అనంతరం పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. పారిశుద్ధ్యం, వనమహోత్సవం, ఇంకుడు గుంతల నిర్మాణాలు తదితర విషయాలపై పట్టణవాసులకు అవగాహన కల్పించనున్నామని వివరించారు. వార్డుల అధికారులు, సిబ్బంది అంకితభావంతో పట్టణ అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్లాలని సూచించారు.

ఆపరేషన్ 'కగార్' నిలిపివేయాలి



ఆత్మకూర్: ఆపరేషన్ కగార్ పేరిట కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలను అణిచి వేస్తుందని, విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు కుట్రలు పన్నుతున్నారని వామపక్షాల పార్టీల నాయకులు ఆరోపించారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు ప్రసాద్, రాజు, మోష, రాబర్ట్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలని, బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరపాలని, ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

వైద్య వృత్తి దైవంతో సమానం



వనపర్తి విద్యావిభాగం: జిల్లా కేంద్రంలోని స్కాలర్స్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివి డాక్టర్లుగా స్థిరపడిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను వారు గుర్తు చేసుకుంటూ ఒకరి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అలనాటి గురువుల బోధన తీరును, వారి ప్రేరణను కొనియాడుతూ వారిని సన్మానించారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ వైద్య వృత్తి దైవంతో సమానమని, ఆపన్నులకు అండగా ఉండాలని సూచించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

వీపనగండ్ల: మండల కేంద్రానికి సమీపంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తెలుగు నర్సింహ(55) అక్కడికక్కడే మృతి చెందాడు. పెబ్బేరు మండలం షాదాపూర్ గ్రామానికి చెందిన నర్సింహ గోపల్‌దిన్నె రిజర్వాయర్‌లో చేపలు పట్టేందుకు కూలి పని చేసేవాడని తెలుస్తుంది. ఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు ప్రమాదం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

విత్తనాలు, ఎరువుల కొరత సృష్టించొద్దు

పాన్‌గల్: వానాకాలం సీజన్‌లో రైతులకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులను ఇబ్బందులు లేకుండా అందించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీరామ్, భారత జాతీయ మహిళ సమాఖ్య ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షురాలు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కళావతమ్మ కోరారు. ఆదివారం మండలంలోని కేతేపల్లిలో పార్టీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ.. వానాకాలం సీజన్‌కు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తూ వేరుశనగ, మొక్కజొన్న, కంది పంటల సాగుకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు నకిలీ విత్తనాలు, ఎరువుల బారిన పడకుండా, వారికి అవగాహన కల్పిస్తూ నాణ్యమైన విత్తనాలు అందేలా చూడాలన్నారు. ఇంకా చాలా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం నిల్వలు ఉన్నాయని, వాటిని వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. కొందరు మత రాజకీయాలు చేస్తూ సీపీఐపై ఆరోపణలు చేస్తున్నారని ప్రజల సమస్యలపై పోరాటాలు చేసేది సీపీఐ మాత్రమే అని వారు గుర్తు చేశారు. సమావేశంలో పెంటయ్య, హన్మంతు, చిన్న కుర్మయ్య, చిన్న ఎల్లయ్య, కోటయ్య, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీరామ్

ఆలయాల నిర్మాణానికి విరాళం

ఆత్మకూర్: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న పోశమ్మ, కర్రెమ్మ, లింగమయ్య, కోటమైసమ్మ, కట్ట మైసమ్మ, భూలక్ష్మమ్మ, బొడ్రాళ్ల ఆలయాల నిర్మాణాల కోసం ఆదివారం మాజీవార్డు సభ్యుడు గడ్డమీది శ్రీనివాస్ రూ.1.25 లక్షల నగదును నిర్వాహకులకు అందజేశారు.

రేపటి నుంచి ప్రతిష్ఠా మహోత్సవాలు

పోశమ్మ, కర్రెమ్మ, లింగమయ్య, కోటమైసమ్మ, కట్ట మైసమ్మ, భూలక్ష్మమ్మ, బొడ్రాళ్ల ఆలయాల ప్రారంభోత్సవాలు, ప్రతిష్ఠ మహోత్సవాలను జూన్ 3 నుంచి 5 వరకు చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు డాక్టర్ మొగిలి శ్రీధర్‌గౌడ్, నిర్వాహకులు అశ్విన్‌కుమార్, ఎస్టీడీ శ్రీను, ఆనంద్, కొండాపురం రాము, మణివర్ధన్‌రెడ్డి, శివానంద్, రమాకాంత్, నాగేష్, వెంకటేష్, యాదగిరిశెట్టి, బాలకృష్ణ, రఘు, సూరి, అశోక్, కృష్ణయ్య, రవీందర్, రాము తదితరులు పాల్గొన్నారు.



నగదును అందజేస్తున్న శ్రీనివాసులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మదనపురం: మండలంలోని దుప్పల్లి జిల్లా పరిషత్ పాఠశాల 2000–01 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళన వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చదువు నేర్పిన గురువులు కుర్మన్న, బెల్లం సాయిలు, రాంరెడ్డి, కరుణాకర్, పుష్పలత, నరసింహయ్య, ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణగుప్తా ను పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లక్ష్మీనారాయణ, సత్యం, మధువర్మ, రమేష్, ఎస్ రఘు, భార్గవచంద్ర, ఖాజా, రమేష్ నాయుడు, మధు, మాసన్న, రాధిక, పద్మ, అన్నపూర్ణ, విజయ, మంజుల, మాధవి, రాధ, సునీత, మధులత తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలి

ఆత్మకూర్: క్రీడాకారులు గ్రామీణ ప్రాంతాలకే పరిమితం కాకుండా జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని డీకే కృష్ణ జువెల్లర్స్ అధినేత విశ్వప్రకాష్ అన్నారు. స్థానిక జాతర మైదానంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం కొనసాగాయి. మొత్తం 36 జట్లు పోటీపడుతున్న ఈ పోటీల్లో విజేతకు మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డి జ్ఞాపకార్థం రూ.50,116, రెండో బహుమతి రూ.30,116 నగదుతో పాటు షీల్డులను అందజేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమంలో నిర్వాహకులు అరుణ్, అనుదీప్, ఇమ్రాన్, అఫ్రోజ్, అస్లాం, రాకేష్, నాని, మహేందర్, భరత్, శ్రీకాంత్, గాండ్లశివ, శ్రీధర్, నవీన్, కోచ్ ఖాదర్, క్రీడకారులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మురుగు కాల్వ ధ్వంసం చేసి ఇంటి నిర్మాణం

అమరచింత: పట్టణంలోని రాంనగర్‌లో డ్రెయినేజీని ధ్వంసం చేసి కాల్వ మధ్యలో పిల్లర్స్ వేసి ఇంటి నిర్మాణ పనులు చేపడుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. యథేచ్ఛగా అక్రమంగా మురుగుకాల్వ మధ్యలో పిల్లర్లు వేస్తున్నారని మున్సిపల్ అధికారులకు విన్నవించినా చర్యలు తీసుకోవడం లేదని కాలనీవాసులు తెలిపారు. పట్టణంలో అక్రమ కట్టడాలు జరుగుతున్నా మున్సిపల్ కమిషనర్ పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతోనే ఇలాంటి ఘటనలు జోరందుకున్నాయని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై కమిషనర్ రవిబాబుకు వివరణ కోరగా.. మురుగు కాల్వను ధ్వంసం చేసి ఇంటి నిర్మాణం చేపడుతున్న వ్యక్తికి పది రోజుల కిందట నోటీసులు ఇచ్చామన్నారు. ప్రస్తుతం ఇంటి నిర్మాణ పనులు జరుగుతున్న విషయం తన దృష్టికి రాలేదని సమాధానం ఇచ్చారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణంలో ఇలాంటి నిర్మాణాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



డ్రెయినేజీ ధ్వంసం చేసి పిల్లర్లు వేసిన దృశ్యం

కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు



కొత్తకోట రూరల్: తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పట్టణ కేంద్రంలోని కేసీఆర్ మైదానంలో ఆదివారం బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించినట్లు సీనియర్ కోచ్‌లు హరీశ్‌యాదవ్, రవి, శివశంకర్ తెలిపారు. ఈ పోటీల్లో మండలంలోని పాలెం, కనిమెట్ట, కొత్తకోట, గోవింవిందహళ్లి, అగ్రహారం, పెద్దమందడి మండలంలోని మోజర్ల గ్రామానికి చెందిన 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి డాక్టర్ కృష్ణకుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు పెంటన్న యాదవ్, నరేందర్‌సాగర్, శ్రీనుయాదవ్, సంతోష్, సామెల్, జి.మురళియాదవ్ బెల్టులు, సర్టిఫికెట్లను అందజేశారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా రాము

వనపర్తి టౌన్: ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా బచ్చు రాము ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం నాయకులు తెలిపారు. శనివారం రాత్రి హైదరాబాద్‌లో బచ్చు రామును అధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర నాయకుడు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు ఆయన సన్మానించారు. అధ్యక్షుడిగా బచ్చు రాము ఎన్నికైన సందర్భంగా పట్టణ ఆర్యవైశ్యులు హర్షం వ్యక్తం చేశారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

వీపనగండ్ల: మండలంలోని రైతులకు జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ డాకేశ్వర్‌గౌడ్ తెలిపారు. 30 కేజీల బ్యాగుకు రూ.2,138 చెల్లించి తీసుకోవాలని కోరారు. విత్తనాలు అవసరమైన రైతులు తమ ఆధార్‌కార్డు, పాస్‌బుక్కు తీసుకొని వ్యవసాయ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.